**డిటెక్టివ్ కథల పోటీలో మూడవ బహుమతి రు. 200/- పొందిన కథ**



## ఆఫీసు మూసేసి గేటుదాటి బైటకొచ్చాం.

## పన్నెండు గంటలనుంచి మూడుదాకా లంచవర్ మాకు. అందరం స్థానికులం కావడం మూలాన ఆఫీసు క్లోజ్ చేసి ఇళ్ళకు బయలుదేరాం.

మా బంట్రోతు గేటు తాళాలు వేస్తున్నాడు. మా ఆఫీసు స్టాఫ్ అంతా ఎవరి మట్టుకు వాళ్లు వెళ్లిపోతూ రేపు వస్తామని చెప్పిపోతున్నారు. బంట్రోతు గది తాళాలు తీసుకువచ్చి నా చేతికి ఇచ్చాడు. తాళాలు జేబులో వేసుకొని ఇంటికి బయలుదేరాను.

మా ఆఫీసుకు నేనే ఆఫీసర్ని. నేను ఆలస్యంగా వచ్చినా...రాక పోయినా అడిగే వారుండరు. కానీ, నేను అలా ప్రవర్తిస్తే సిబ్బంది మాత్రం సక్రమంగా వస్తారా! ఆలోచిస్తూ అడుగులు వడివడిగా వేస్తున్నాను.

"సార్!"

వెనుక ఎవరో పిలిచినట్లయి గబుక్కున వెనుదిరిగాను.

పోస్టుమేన్ అప్పలస్వామి!

ఊరంతటికీ అప్పలస్వామే ఉత్తరాలు బట్వాడా చేస్తాడు. ఆ వూరు చాలా చిన్న వూరు. పల్లెకూ-పట్నానికి చెందని మధ్యతరగతి గ్రామం.

నవ్వుతూ నా దగ్గరకు వస్తున్నాడు అప్పలస్వామి.

ఉదయాన్నే నాకు వచ్చిన లెటర్స్ ఇచ్చేస్తాడు. మరి. మళ్ళా ఇప్పుడెందుకొచ్చాడబ్బా?! ఒకవేళ ఏదైనా లెటర్ ఇవ్వడం మర్చిపోయాడేమో! కొంపదీసి టెలిగ్రామా? ఆ మధ్య ఓ వారపత్రిక డిటెక్టివ్ కథల పోటీకి పంపిన కథకిగాని ప్రైజ్ రాలేదు కదా?

ఆ వూహ నాలో జనించేసరికి నాకు కొంచెం చలిజ్వరం పట్టుకున్నట్టూ ఆనందంతో ఒళ్ళు కంపించింది.

అప్పలస్వామి నాకు దగ్గరగా రాక ముందే నవ్వుతూ ఎండుకుపోతున్న గొంతుని తడి చేసుకుంటూ ఆత్రంగా అన్నాను.

"ఏమిటి విశేషాలు? ఏదైనా అర్జెంట్ మెసేజా?!"

"అబ్బె! అదేం కాదండి!" అప్పలస్వామి ఏ భావనతో అన్నాడో...?

నాకు ఒక్కసారి మంచుకొండల అంచున నించున్నట్లనిపించింది.

"మరెందుకుపిలిచావ్?!" నా గొంతుకలో నాకే అర్థం కాని నిష్ఠూరం ధ్వనించింది.

"ఏమీలేదండీ.... ఇదిగో ఇదేదో ఉత్తరం. తలా తోకా లేదు. అడ్రసు అస్పష్టంగా వుంది. మేటర్ మాత్రం అర్థమవుతోంది. అడ్రసు చదవడానికి నాకు కళ్ళు ఆనటం లేదు. మీకు అర్థమౌతుందేమోనని—! అదీగాక, ఇదేదో చదువుతూంటే మీకు కథ

'ఇందూ రమణ'





వ్రాయడానికి ఉపయోగపడుతుందేమోనని తెచ్చా!"

"నాకా? ఉపయోగమా?" ఆశ్రుతగా అందుకున్నాను.

అడ్రసు వర్షంలో తడిసిపోయి అలుక్కు పోయింది.

మిగతా విషయమంతా బాగానే వుంది. అడ్రసు వ్రాసిన ప్రక్క అంతా తడిసిపోయింది ఆ ఉత్తరం ఎవర్రాశారో అంతుచిక్కకుండా చెరిగిపోయింది.

ఉత్తరాన్ని పరిశీలనగా అటూ-ఇటూ తిరగేసి చూశాను దస్తూరి చాలా బావుంది. సంతకం సగం చెరిగిపోయి మిగతా సగం అలుక్కుపోయింది. పేరులో రెండవభాగం బాగా కన్పిస్తోంది. 'లక్ష్మి' అన్న అక్షరాలే స్పష్టంగా గోచరిస్తున్నాయి. బహుశా ఆ అమ్మాయి పేరు వసంతలక్ష్మి .. భాగ్యలక్ష్మి ... రాజలక్ష్మి ... ఇంకేదో లక్ష్మి అయుంటుంది.

ఉత్తరాన్ని మడిచి అప్పలస్వామికేసి తల ఎత్తి చూశాను.

'ఏమైనా అర్థమయిందా?' అన్నట్టు అప్పలస్వామి నాకేసి చూస్తున్నాడు.

"సాయంత్రం ఓసారి యింటికి రా! మాట్లాడాల్సిన పనుంది." అన్నాను.

అప్పలస్వామి 'అలాగే'నని తలూపి వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరుకున్నాను. భోజనం చేసి నా గదిలోకి వెళ్ళి కూర్చొని ఉత్తరం బైటకు తీశాను.

"ఇన్‌స్పెక్టర్‌గార్కి!

"నేను ఆపదలో ఉన్నాను. నన్ను నా భర్తే చంపాలనుకుంటున్నారు. నాకు 'నా' అనే వాళ్ళెవరూ లేరు. ఉన్నవాళ్ళు నన్ను వదులుకున్నారు. అప్పట్నుంచీ నేను నావాళ్ళకు దూరమై బతుకుతున్నాను. కానీ రెండు నెలలుగా ఆయన ఎందుకో మనిషిగా కాక మృగంలా ప్రవర్తిస్తున్నారు. నన్ను- నా శీలాన్ని గేలిచేస్తూ- అవమానపరుస్తూ- అనుమానాలతో నన్ను- నా అభిమానాన్ని తూట్లు పొడుస్తున్నారు.

ఇనస్పెక్టర్‌గారూ! ఈ భయంకర నరక యాతన నేను భరించలేకుండా ఉన్నాను. ఎటైనా పారిపోవాలనిపిస్తోంది. కానీ ఈ వూరు దాటి బయటపడగలనన్న ధైర్యం నాకు లేదు. మా వాళ్ళకు ఉత్తరం వ్రాసినా వాళ్ళు నేనేనాడో మరణించానని నాకు పిండం వదిలేసారు. అందుకే మీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. నన్ను రక్షించండి. ఆయన నన్ను చంపేస్తారు. నాకు ప్రాణభిక్ష పెట్టండి. నన్నాయన బారి నుండి రక్షించండి. నేను............"

తర్వాత విషయమంతా వెనక ప్రక్క వ్రాసిందామె. వెనుక వ్రాసిన విషయమంతా చెరిగి పోయింది. సంతకం మాత్రం సగం మిగిలింది.

ఉత్తరాన్ని పదే పదే పరిశీలనగా చూసి- నాలుగైదుసార్లు చదివి ఆలోచనగా కుర్చీకి చేరగిలబడ్డాను.


'ఆపదలో' ఇరుక్కున్న ఈ అబల ఎవరు? ఆ అమ్మాయి అడ్రసు కూడా చెరిగిపోయింది. మరి, ఎలా ఆమెను కనుక్కోవడం? ఈ లోపున ఆమెకి ప్రమాదంగాని జరిగితే....?

ఈ ఉత్తరం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించినది. ముందు ఇనస్పెక్టర్ వర్మను కలిసి ఉత్తరం చూపించాలి. అతని నిర్ణయం కనుక్కుందాం.

వర్మ ఇంటికి ఒకాఒకిన బయలుదేరాను.

"రా! రా! డిటెక్టివ్! ఏమిటిలా హఠాత్తుగా ఊడిపడ్డావు. ఏదైనా కొత్త కథ

# స్వపరిచయం



అబల

'ఇందూ రమణ' కలం పేరైనా అసలు పేరు "లోగిశ వెంకటరమణ" తల్లి దండ్రులు స్వర్గస్థులైతే నిన్నటి వరకూ అన్నల అండలో ఏకాకిగా కాలం గడిపినా ఈ నెలే (3-8-84') "లక్ష్మితులసి"తో పెళ్లయి ఒంటరి వాడిని ఓ ఇంటివాడి నయ్యాను. సాహితీ పరంగా చెప్పాలంటే, నా తల్లిదండ్రులకంటే- నా వాళ్లకంటే ఎక్కువగా నా పురోభివృద్ధిని. ప్రగతిని కాంక్షించేది గురుతుల్యులు శ్రీ యాతగిరి శ్రీరామ నర్సింహారావు (రాజమహేంద్ర వరం) గారే!

1977లో విజయనగరం మహరాజా కళా శాలలో చదువుతున్న రోజుల్లో- సింహా చలం దేవస్థానంవారి విద్యార్థి భోజన సత్రంలో తరచూ ఎదురయ్యే ఓ కొత్త వ్యక్తి నాకు భోజనాల దగ్గర కలిసి. సాహి త్యంతో చేరువయ్యాడు. అప్పటినుంచి. ఇప్పటివరకూ అనుక్షణం నా 'కృషి' ఆయనకి- అతని సత్ఫలితాలు నాకు కాకి కబుర్లుగా ఉత్తరాలద్వారా తెలుపుకుంటూ గడుపుతున్నాం. ఆ వ్యక్తి నా సాహితీ ప్రాణమిత్రుడు శ్రీ కె. కె. రఘునందన (ఈ శుభ సందర్భంలో ఆయన్ని తలచు కోవడం నా ధర్మం.)

ఇకపోతే జులై 20వ తేదీన అనుకో కుండా మా 'బ్యాంకు' కు వచ్చి ఓ చిరు నామాలేని ఉత్తరం చూపించి ఈ 'కథ' కి ప్రాణం పోసిన పోస్టుమేన్ శ్రీపాండ్రంకి అప్పలస్వామిని పేరు తెలియక తికమక పడుతున్న నాకు 'అబల' పేరు సూచించిన సోదరి విశ్వంభర జయంతిని-నా అముద్రిత కథల నిన్నాళ్ళూ ఓపికతో చదివి సంతోష పడే ఇంకోచెల్లి ధనలక్ష్మిని-ఇంకా కష్టలతో కార్పణ్యాలతో అనుక్షణం అతలాకుతల మౌతున్న ఊర్లో సాహితీపరంగా నేనొ క్కడ్నే ఏకాకిగా ఆలోచనలతో కాలం గడుపుతున్నప్పుడు నాకు చేరువయిన మిత్ర బృందం సర్వశ్రీ గట్టా, బెహరా, బలివాడ, కుమార్, రవి, ఈశ్వరీ మరియు లోగిశ లక్ష్మినాయుడులను కూడా ఈ సమయంలో తలుచుకోవడం-కృతజ్ఞతలు చెప్పుకోవడం తప్పు కాదు.

—ఇందూ రమణ

మొదలెట్టావా?"

లాన్ లో కూర్చొని ఏదో పుస్తకం చదువుతున్న వర్మ నన్ను చూసి పలకరిస్తూ పుస్తకం మడిచి 'టీ'పాయ్ మీద పెట్టాడు.

నేను నవ్వుతూ వెళ్ళి వర్మకు ఎదురుగా కూర్చున్నాను.

జేబులో భద్రంగా దాచిన ఉత్తరం తీసి వర్మకు అందించాను.

ఉత్తరాన్ని చదివి నా వైపోసారి సూటిగా చూసి అన్నాడు వర్మ-

"ఈ ఉత్తరం నీకెలా వచ్చింది?"

"ఏం....!"

"ఇది మా స్టేషన్‌కు రాకుండా నీకెలా వచ్చిందని. కొంపదీసి ఉత్తరాలని మధ్యలో ట్రాప్ చేస్తున్నావా?"

"అప్పల స్వామినేం తప్పు పట్టకు అత నికి ఎప్పుడైనా ఏదైనా అడ్రసు సరిగ్గా అర్థం కాకపోతే నాకు చూపిస్తాడు అలాగే ఈ ఉత్తరం కూడా అతనికి సమస్య అయితే నాకు చూపించాడు. నాకూ ఇప్పటివరకూ అంతు చిక్కలేదు అర్థ మయిన వెంటనే ఇలా నీదగ్గరకు తెచ్చాను "

"థేంక్స్." అని టీపాయ్ క్రింద అరలో పడేసి నావైపు "ఏమిటి విశేషాలు" అన్నట్టూ చూశాడు వర్మ.

"ఆ ఉత్తరం.... ?" ప్రశ్నార్థకంగా అన్నాను

ఏం చేస్తాం?" నన్నే ఎదురు ప్రశ్నిం చాడు" వర్మ.

"ఆమె ఎవరో కనుక్కోలేమా !?"

"ఎలా? తలా తోకా లేదు . ఈ వూర్లో ఆ అమ్మాయి ఎక్కడుందో.... ఏ మూల నుందో .? ఆధారాలు లేని ఆ దేదో ముంచు కొస్తోందని ఆమె వ్రాసింది. ప్రేమించి పెళ్ళాడిన భర్తే చంపబోతున్నాడట. వాట్ వండర్! నాకు నమ్మశక్యంగా లేదు. ఎవరో మమ్మల్ని.... మా డిపార్ట్‌మెంట్‌ని ఎగతాళి చేయడానికి వ్రాసిన ఉత్తరంలా వుంది . ఐ కాంట్ బిలీవ్! అండ్. ఐ డోంట్ లైక్ దిస్ బ్లడీ నాన్సెన్స్!"

"వర్మా! ఈ ఉత్తరం ఎందుకో నాకు నిజంలానే కన్పిస్తోంది "

"శర్మా! నీకు వూహ తప్ప.. వాస్తవం అర్థంగాదు .నీకు అంతగా ఆ అజ్ఞాత అబల మీద సానుభూతిగాని ఉంటే నువ్వే ప్రయ త్నించు. కనుక్కొని నా దగ్గరకు రా! నేను రంగంలోకి దిగుతాను.... సరేనా?!"

"థేంక్స్ !" అనేసి ఉత్తరం అడిగి తీసుకొని మరి మాట్లాడకుండా వచ్చేసాను.

ఆ సాయంత్రం అప్పలస్వామి ఇంటికి వచ్చాడు.

"అప్పలస్వామీ ! ఏ వీధిలో ఎంత మంది 'లక్ష్మి'లున్నారో బాగా ఆలోచించి చెప్పు. నేను లిస్టు వ్రాస్తాను." అని పెన్నూ-పేపరు తీసుకున్నాను.

అప్పలస్వామి ఆలోచనగా దూలాల వైపు చూస్తూ చెప్పసాగాడు.


"కొత్తవీధిలో వరలక్ష్మి లిద్దరున్నారు సార్. వాళ్లిద్దరూ కాక సౌభాగ్యలక్ష్మి. సౌందర్య లక్ష్మిలు కూడా వున్నారు. మధ్య వీధిలో వెంకటలక్ష్మిలు ఇద్దరు-ధనలక్ష్మిలు ఇదరు-తులసీలక్ష్మి. మూడోవీధిలో వసంత లక్ష్మి. కనకమహాలక్ష్మి. భాగ్యలక్ష్మిలు. కాక. బడి వీధిలో రామలక్ష్మి. రాజ్యలక్ష్మి. సీతామహాలక్ష్మిలున్నారు సార్."

"యాతపేటలో కూడా సత్యలక్ష్మి. ఆది లక్ష్మిలున్నారు. వాళ్ళిద్దరూ నిశానీల బాపతు సార్."

ఆలోచిస్తూ.... చెప్పి. మధ్య మధ్య ఆగి చెప్పాడు అప్పలస్వామి.

"అయితే, వీళ్ళందరూ మనకనవసరం. మనకు దొరికిన ఉత్తరాన్ని బట్టి ఆలోచిస్తే. నా కర్థమయింది. 1. మనకు కావాల్సిన లక్ష్మికి పిల్లలు లేరు. 2 ఆ లక్ష్మి కులాం తర వివాహం చేసుకుందనడానికి ఆధారం కన్పిస్తోంది. 3 ఆ లక్ష్మి నడివయస్కు రాలు కాదు- యవ్వనవతి. ఈ విషయాలు దృష్టిలో పెట్టుకొని వీళ్ళలో అటువంటి వాళ్ళుంటే ఆలోచించి చెప్పు." అన్నాను.

"అలాగే సార్. కొత్త వీధిలో ఇద్దరు



## మినీ కథలకు ఆహ్వానం

ఇదివరలో కొన్ని సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా రెండు కవితా సంకలనాలు (అరుణార్ణవం చైతన్య చిత్రాలు) వెలువరించిన "భావన" సంస్థ ఇప్పుడు వివిధ సాహిత్య ప్రక్రియలపై కరపత్రాలుకూడా వెలువరించాలని నిర్ణయించింది. మొదటి బులెటిన్ నవంబరులో వెలువడుతుంది. ఆ బులెటిన్ కోసం ప్రస్తుత సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్రాసిన మినీ కథలను హామీపత్రం స్వంత చిరునామా కల్గిన స్టాంపులంటించిన కవరు జతపరచి అక్టోబరు 15 తేదీలోగా కె. వి. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి భావన (హేలపురి సాహితీసుమం), ఏలూరు-534001 అనే చిరునామాకు పంపవలసిందిగా సంస్థ ఒక ప్రకటనలో రచయితలకు విజ్ఞప్తి చేసింది.

## సమాచారం

### సాంస్కృతిక సంస్థచే ఉచిత వైద్యశాల స్థాపన

విశాఖ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని తారకరామానగర్‌లో ఉచిత హోమియో వైద్యశాలను కార్పొరేటర్ శ్రీమతి పాలూరి శేషుమాంబ ఇటీవల ప్రారంభించారు. తొలుత సొసైటీ వ్యవస్థాపకుడు శ్రీ విజయ్ ప్రసాద్ స్వాగతం పలికారు. ముఖ్య అతిధిగా జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఎం. హైమవతీదేవి పాల్గొన్నారు.

వైద్యశాలకు గౌరవ వైద్యులుగా డాక్టర్ డబ్బీరు గౌరీ శంకరరావు, డాక్టర్ డబ్బీరు ఉషాలక్ష్మి, డాక్టర్ కె. సుధాకరరావులు వ్యవహరిస్తున్నారు.

విశాఖ న్యాయవాదుల సంఘం కార్యదర్శి సొసైటీ అధ్యక్షుడు శ్రీ ఎమ్ వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. జర్నలిస్టు శ్రీ ఆర్. చిదంబరం ప్రసంగించారు. శ్రీ పి దొరబాబు, శ్రీ ఎమ్ శంకరరావు, శ్రీ ఎమ్. సూర్యనారాయణ, శ్రీమంత్రి శ్యాంప్రసాద్ తదితరులు ప్రసంగించారు. రఘునాథ్ మిమిక్రీ ప్రదర్శన జరిగింది.

సరలక్ష్మిల్లో ఒకామె ముసలావిడ. రెండో ఆవిడకు భర్త లేడండి సౌభాగ్యలక్ష్మికింకా పెళ్ళికాలేదు సార్. సౌందర్య లక్ష్మికి పిల్లలున్నారు." ఆలోచిస్తూ అన్నాడు అప్పలస్వామి.

"గుడ్. వీళ్ళెవరూ మనకు కావాల్సిన లక్ష్ములు కాదు కదా! ఇలాగే. మిగతావాళ్ళ పర్సనల్స్ ఆలోచించి చెప్పు"

నోట్ చేసుకున్న పేర్లల్లో పైపేర్లు కొట్టేస్తూ అన్నాను.

"మధ్య వీధిలో వెంకటలక్ష్మిలిద్దరూ పెళ్ళయినవాళ్ళే ఇద్దరికీ పిల్లలు లేరు. కానీ వాళ్ళిద్దరూ సత్సంప్రదాయం నుంచి వచ్చిన వాళ్ళు నిష్ఠా గరిష్ఠులయిన వైష్ణవ పీఠాధిపతుల పత్నులు వాళ్ళు" అన్నాడు అప్పలస్వామి

"వెల్....వెల్ నెక్స్ట్" అప్పలస్వామి చెబుతున్న ప్రతి విషయం శ్రద్ధగా వింటూ కావాల్సిన విషయాలు నోట్ చేస్తున్నాను.

"ధనలక్ష్మిలిద్దర్లో ఒకామెకింకా పెళ్ళికాలేదు సార్. రెండో అమ్మాయి కులాంతర వివాహం చేసుకుంది కానీ ఆమె కురూపి సార్. వాళ్ళాయన బీదవాడు. వాళ్ళిద్దరిదీ కులాంతరమైనా పెద్దల అనుమతితో చేసుకున్న పెళ్ళి సార్. తులసీలక్ష్మికి రేపు మూడో తారీఖున పెళ్ళి. మూడో వీధిలో వసంతలక్ష్మికి పెళ్ళయింది పిల్లల్లేరు. కలగరు. ఆమె గొడ్రాలంటారందరూ. వయసులోనే వుందిలెండి. కనకమహాలక్ష్మికి కూడా పెళ్ళయింది. పిల్లలులేరు. భాగ్యలక్ష్మికి చిన్నప్పుడే భర్త పోయాడు. అవిడ బాల్య వితంతువు. బడి వీధిలో రాజ్యలక్ష్మికి పెళ్ళికాలేదుగాని సార్. ఆమె ఎవరితో బడితే వాళ్ళతో విచ్చలవిడిగా తిరుగుతుందని అంటారు. రామలక్ష్మికి పెళ్ళయింది సార్. ఆమెకీ పిల్లలు లేరు. సీతామహాలక్ష్మికూడా పెళ్ళయిందిసార్. పిల్లలు లేరు." అన్నాడు అప్పలస్వామి.

"అప్పలస్వామి చెప్పినదాన్ని బట్టి చూస్తే మూడో వీధిలోని వసంతలక్ష్మి, కనకమహాలక్ష్మి, బడివీధిలో రామలక్ష్మి, సీతామహాలక్ష్ముల్లో అసలు 'లక్ష్మి' దాక్కొని ఉందన్నది యధార్థం. ఆమెని ఎలా కనుక్కోవడం?"

ఆలోచిస్తూ క్షణం కళ్ళుమూసుకున్నాను.

"అప్పలస్వామీ వీళ్ళందరూ కులాంతర వివాహం చేసుకున్న వాళ్ళేనా?"

"తెలీదు సార్! వీళ్ళందరూ ఈ వూర్లోకి కొత్తగా వచ్చారు. చెప్పటంమరిచానుసార్. బడివీధిలో రామలక్ష్మిభర్త త్రాగుబోతు.... జూదరి.... తిరుగుబోతు సకలగుణ సంపన్నుడు సార్!" అన్నాడు అప్పలస్వామి.

"వెల్ ఇటువంటి పర్సనల్ విషయాలు మనకి బాగా ఉపయోగపడతాయ్. రేపు సువ్వో పని చెయ్యాలి. వీళ్ళ నలుగురి దగ్గరా సంతకాలు తీసుకోవాలి. వీలయితే వాళ్ళ కుటుంబ కలహాలగురించి.... కలతల గురించి గ్రహించు వీలయితే ఆరా తియ్యి"

"ఎలా సార్!"

"ఏముంది మా ఆఫీసువాళ్ళు నేను సరిగ్గా ఉత్తరాలు బట్వాడా చేస్తున్నదీ లేనిదీ ఆరా తీస్తున్నారని .... బట్వాడా చేస్తున్నదానికి ఆధారంగా ఈ సంతకాలు పెట్టిస్తున్నానని చెప్పు. ఆ! వీళ్ళ నలుగురివీ అడ్రసులు చెప్పు" అన్నాను

"అలాగే సార్!" అని అప్పలస్వామి అడ్రసులు చెప్పాడు.

నేను నోట్ చేసుకున్నాక అప్పలస్వామి వెళ్ళిపోయాడు.

నేను ఆలోచిస్తూ అలాగే కుర్చీ వెనక్కి చేరగిలబడ్డాను

ఏదో ఆలోచన.... నా మెదడులో మెదిలేసరికి దిగ్గున లేచాను.

మూడో వీధికి హుటాహుటిన బయలుదేరి వెళ్ళాను.

నా భుజాన సంచి వ్రేలాడుతోంది. సంచిలో అట్టహాసం కోసం కెమెరా—రెండు మూడు మేగజైన్స్ వేసుకున్నాను.

వసంతలక్ష్మి అడ్రసు వెతుక్కుంటూ వాళ్ళింటికి వెళ్ళాను.

తలుపులు దగ్గరగా వేసున్నాయి.

తలుపు మీద నెమ్మదిగా టక్....టక్....మని కొట్టాను.

"ఎవరూ?" అంటూ ఓ స్త్రీ తలుపులు తెరిచింది

"మీరు రామారావుగారి భార్య కదూ!" చనువుగా అన్నాను. నా గొంతులో సంస్కారం.

"అవునండి. మీ....రు....?!" ఆమె సందిగ్ధంగా అంది.

"మీ పేరు వసంతలక్ష్మి కదూ!"

"అ....వు....ను..!" ఆమె గొంతులో వచ్చి వెలక్కాయ పడింది.

"లోపలకు రావచ్చా?" నమ్రతగా అన్నాను.

"రండి" తలుపుకు అడ్డం లేస్తూ లోపలకు దారితీస్తూ అంది ఆవిడ.

"నా పేరు వెంకటేశ్వరశర్మ. నేను పత్రికలకు వ్యాసాలు....ఫీచర్స్ వ్రాస్తుంటాను. "కొత్త వారం" వార పత్రికకు ఈ వారం నేనో ప్రత్యేకవ్యాసం వ్రాయాలనుకున్నాను. అందుకోసం మీలాంటి ఉత్తమ గృహిణులను ఓ నలుగురిని ఇంటర్వ్యూ చేద్దామని బయలుదేరి మీదగ్గరకు వచ్చాను" అన్నాను.

"క్షమించాలి ఆయన వూళ్ళో లేరు. మీరు తర్వాత మరోసారి రండి" ఆమె సభ్యతగా

అంది.

"అదికాదండి. నేను.........!?" ఏదో అనబోయాను.

"ఆయనకి చెప్పకుండా.... ఆయన అనుమతి లేకుండా స్వతంత్రంగా మీకు నేను ఇంటర్వ్యూ ఇవ్వలేను. ఆయనకి తెలిస్తే! అమ్మో ఇంకేమన్నా ఉందా?" అని ఆమె అర్థోక్తిగా ఆగిపోయింది.

అప్పుడు ఆమె కళ్ళల్లో భయం లీలగా కదిలి మాయమైంది.

మరిక నేనేం మాట్లాడను! అయోమయంగా లేచి బయటకొచ్చేశాను.

కనకమహాలక్ష్మి ఇంటికి వెళ్ళాను. అక్కడ అమ్మలక్కలందరూ కొళాయి దగ్గర పోట్లాడుకుంటున్నారు. కనకమహాలక్ష్మి ఇంటిముందుకు వెళ్ళాను.

"ఇంట్లో ఎవరూ లేరండి అదిగో! అక్కడ కొళాయి దగ్గర ఎవరితోనో గొడవ పడుతోందావిడ" ప్రక్కింటావిడ అంది.

మరిక ఎవరినీ కలవడం ఇష్టంలేక ఇంటి ముఖం పట్టాను. రేపు అప్పలస్వామి తెచ్చే సమాచారాన్ని బట్టి ఆలోచించాలి.

ఆ మర్నాడు సాయంత్రం అప్పలస్వామి మా ఇంటికి వచ్చాడు. అప్పుడే నేను ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాను.

"సార్! మీరన్నట్టూ వాళ్ళ నలుగురిళ్ళకూ వెళ్ళాను. నలుగురూ కులాంతర వివాహం చేసుకున్నవాళ్ళే. ఇంకోవిషయం సార్. నిన్న మీకు ఇంకోఇద్దరి సమాచారం చెప్పలేను. ఆ వీధిలోనే జయలక్ష్మి ... సుబ్బలక్ష్మిలు కూడా వున్నారు. పనిలో పని వాళ్ళ సంతకాలూ తీసుకున్నాను వసంత లక్ష్మిని వాళ్ళాయన సంతకం పెట్టనివ్వకుండా తనే సంతకం పెట్టాడు. రామలక్ష్మి అసలు ఇంట్లో నుంచి పైకిరాదట ఎప్పుడూ. వాళ్ళ వాళ్ళే సంతకం చేశారు." అన్నాడు అప్పలస్వామి.

సంతకాలు పెట్టిన పుస్తకం తీసుకున్నాను.

డెస్కులో దాచిన ఉత్తరం తీసి సంతకాల్ని పరిశీలించి చూసాను ఆ రాత్రంతా ఆ సంతకాలతో తంటాలు పడ్డాను. ఏ సంతకం 'లక్ష్మి'సంతకాన్ని పోలలేదు.

అంటే. వీళ్ళెవరూ కాదన్నమాట.

ఇక మిగిలింది వసంత లక్ష్మి ...రామలక్ష్మి. వాళ్ళిద్దర్నీ కలిస్తే కొంతవరకు సమస్య పరిష్కారం కావచ్చు.

ఆ మర్నాడు ఆఫీసుకి సెలవు పెట్టి వర్మను కలిశాను. నా పరిశోధనంతా వివరించి చెప్పాను. వర్మ చాలా సంతోషించాడు.

ఇద్దరం బుల్లెట్ మీద ముందుగా రామలక్ష్మి ఇంటికి వెళ్ళాం.

ఎవరో మధ్య వయస్కుడు వచ్చి తలుపు తెరిచాడు.

ఇన్‌స్పెక్టర్‌ని చూసి ఆయన కంగారు పడ్డట్టున్నాడు. తలుపు తెరిచి భయం.... భయంగా చూస్తూ లోనికి దారి ఇచ్చాడు.

"మీ ఇంట్లో రామలక్ష్మి ఎవరైనా ఉన్నారా?" వర్మ కంఠంలో కరకుదనానికి నేనే భయపడ్డాను.

"ఏం బాబూ!" అంటూ ఎవరో ముసలామె గుండెలు బాదుకుంటూ పరిగెత్తుకొచ్చింది. బహుశా ఆమె ఈ ముసలాయనకు అర్ధాంగి అయుంటుంది.

"ఆమెనో సారి పిలవండి" వర్మ హుందాగా అన్నాడు.

"ఆమె...ఆమె ..రావడానికి కాదుసార్!" ముసలాయన మధ్య .... మధ్య బెక్కుతూ అన్నాడు.

"ఎందుకు కాదు?.... పిలవండి" సింహగర్జనలా వర్మ కంఠం.

"ఆమెకి మతి స్థిమితంగా లేదు సార్."

ఆ ముసలాయన జవాబు వినేసరికి ఉలిక్కిపడ్డాను. వర్మ కూడా నా మొహంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఆమెను తీసుకురండి" అన్నానేనను.

ఇద్దరూ ఆమెని రెండురెక్కలు విరిచి పట్టుకు తీసుకువచ్చారు.

రామలక్ష్మిని చూసి ఇద్దరం షాక్ తిన్నాం మరి మారు మాట్లాడకుండా బైట కొచ్చేశాం.

"ఏంచిటిరా శర్మ! ఇదంతా!" అయోమయంగా అన్నాడు వర్మ.

"చూద్దాం. వసంతలక్ష్మి ఇంటికి వెళ్తే ఏదైనా విషయం తెలియొచ్చు."

"ఏమోరా! నిన్నూ....నీ పరిశోధన చూస్తుంటే నవ్వొస్తోంది. కొంపదీసి నా ఉద్యోగానికేం ఎర్త్ రాదు కదా!"

"నీకేం భయం లేదులేరా! నాదీ హామీ! నిన్న నాతో వసంతలక్ష్మి మాట్లాడిన వాలకం ...వాళ్ళాయన అంటే ఆమె భయపడ్డ తీరు పరిశీలిస్తే-నాకు అనుమానంగానే ఉంది. ఎందుకైనా మంచిది పద చూద్దాం."

మూడో వీధికి వెళ్ళాం.

వసంతలక్ష్మి ఇంట్లోకి అడుగుపెట్టాం.

వాళ్లాయన ఇంట్లో లేడు. మొదట ఆమె నన్ను చూసి మొహం చిట్లించింది. వర్మని చూసి భయపడి కుర్చీలు వేసింది కూర్చోమని.

"మీరు వసంతలక్ష్మి కదూ!" వర్మ ప్రశ్న.

"అవునండి." నమ్రతగా....నెమ్మదిగా అంది ఆమె.

"మీవారు మంచి వారేనా ?!"

"మీ కెందుకా అనుమానం ?"

"మీది కులాంతర వివాహం కదూ!"

"అవును."

"మీ వారు త్రాగుతారు కదూ!"

.... .... ....

"బాధపెడతారు."


".... .... ....

"ఆయనకు అన్నివ్యసనాలూ ఉన్నాయి. అవునా?"

"కావచ్చు. కానీ. ఆయన నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. నా మాట ఆయన జవదాటరు. నేను ఆయన్ని ఆరాధిస్తున్నాను. తను ఎలాంటి మైకంలో ఉన్నా నన్నాయన గౌరవిస్తారు. నేనాయన అనుమతి-అంగీకారం లేనిదే ఏ పనీ చేయను."

"మీకంటే అంత అభిమానమా ఆయనకు?" వర్మ కంఠంలో కర్కశత్వం.

"క్షమించాలి. మీరు నన్నింత కఠినంగా ప్రశ్నించాల్సిన అవసరం లేదు. మా భార్యా



భర్తల గురించి ఆరా తీయడానికి కారణం తెలుసుకోవచ్చా?"

ఆమె బాగా చదువుకున్నదానిలా ఉంది. ఆమె గొంతులో అవమానం — కోపం కలగలుపుగా ధ్వనించాయి.

వర్మ మరేం మాట్లాడలేదు. లేచి నిలబడ్డాడు.

"లక్ష్మిగారూ! మీరెందుకో భయపడుతున్నట్టున్నారు. మీకేం భయంలేదు. మీ బాధ అంతా చెప్పండి. మీ ఆయన బారి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోడానికి ఇంతకంటే అవకాశం మరి దొరకదు" నెమ్మదిగా ఆమెకు నచ్చజెప్తూ అన్నాను.

"మీరెవరో నాకు తెలియదు. కానీ, మీరెందుకిలా ప్రవర్తిస్తున్నారో నా కర్థం కావటంలేదు. దయచేసి వెళ్ళిపొండి"

ఆమె అలా అనేసరికి వర్మలో కోపం కట్టలు త్రెంచుకుంది. మునెన్నడూ అంత అవమానం భరించి ఉండడు వర్మ. ఆ కోపాన్ని కాళ్ళలో చూపిస్తూ అడుగులు భారంగా బలువుగా వేస్తూ బూట్లు టకటకలాడిస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

నాకంతా అయోమయంగా వుంది. నేను ఊహించినదొకటి. జరిగినదొకటి. ఏవిటి? ఎందుకిలా నా అంచనాలు తారుమారవుతున్నాయి?

ఇంతకీ ఆ ఆపద లక్ష్మి ఎవరు? ఆమెని ఎలా ఆదుకోవడం?

పాపం వర్మ! నా వలన ఆమె ముందు తల వంచవలసివచ్చింది. నేనా అవమానాన్ని లెక్క చెయ్యను. నా మెదడూ-మనసూ కల్లోలంగా ఉంది.

వర్మ దగ్గరకు వెళ్ళాను. వర్మ బుల్లెట్ స్టార్ట్ చేశాడు. నేను వెనుక ఎక్కాను.

"సారీ రా వర్మా! నా వలన...."

నా మాటను మధ్యలో త్రుంచేస్తూ—

"శర్మా! నీకెందుకొచ్చిన గొడవరా ఇది." వర్మకంఠంలో కోపం లేదు. నామీద జాలి, ప్రేమ ధ్వనించాయి.

"వర్మా! నన్ను చిన్నచూపు చూస్తున్నావు కదూ!"

"లేదురా! నీ మానాన నువ్వు కథలు వ్రాసుకోక- ఎందుకొచ్చిన తంటా అంటున్నా. నీకు తోచినది.... ఊహించినది వ్రాసుకోక ఈ తలనొప్పి ప్రయత్నమంతా ఎందుకు చెప్పు."

నేనేం మాట్లాడలేకపోయాను.

"ఇంతకీ ఒరేయ్ శర్మా! ఆ ఉత్తరం ఈ వూళ్ళో పోస్టు చేసినదేనా? ఈ వూళ్ళో అమ్మాయే ఆ ఉత్తరం వ్రాసిందనటానికి ఆధారం ఉందా?" ఉన్నట్టుండి వర్మ అన్నాడు.

నా గొంతులో వెలక్కాయ పడింది.

అవును ఇంతకీ ఆ ఉత్తరం ఈ వూళ్ళో పోస్టు చేసినదేనా? ఆ ఆలోచన రాగానే జేబులో ఉత్తరం తీసి చూశాను.

ఉత్తరం మీద ఏ వూర్నించి వచ్చిందీ వ్రాసి లేదు. పోస్టాఫీసు వాళ్ళు ఏ పోస్టాఫీసు నుంచి డిస్పాచ్ చేశారో స్టాంప్ కొట్టాలి. పొరపాటున వాళ్ళు ముద్ర కొట్టలేదు.

అయితే- ఈ ఉత్తరం ఈ వూరిది కాదా!

ఇద్దరం స్టేషన్ ముందు దిగాం.

నేను వర్మకి "థాంక్స్" చెప్పి ఇంటికి బయలుదేరాను.

ఇంటికి వెళ్ళేసరికి —

జనం.... జనం.... జనం....!

ఊరంతా మా ఇంటిమీద కొచ్చి పడ్డట్టుంది.

ఏమైంది?

నా మనసెందుకో కీడును శంకించింది.

నా గుండెందుకో వేగం పుంజుకుంది. అలారంలా వేగంగా కొట్టుకొంటోంది

ఏమైంది? ... ఏం జరిగింది?

భారంగా అడుగులు వేస్తూ.... జనాన్ని చీల్చుకొని లోపలకు వెళ్ళాను.

అక్కడ—

ఆ దృశ్యం చూసేసరికి నాలో చలనం చచ్చిపోయింది.

నా యెదలో ఏదో రొద.

నా కళ్ళల్లో కారం కుక్కినట్లూ—

నా మదిలో బాధ కళ్ళ నుంచి కన్నీళ్ళలా మారి జారి క్రిందపడుతోంది.

"వదినా!"

బావురుమంటూ శవంమీద పడ్డాను.

ఏవో గుసగుసలు ... ఎవరో.... ఏదో అంటున్నారు. అనుకుంటున్నారు.

"పాపం!

నిన్నగాక మొన్న కాపురానికొచ్చిన పిల్ల. నిండు నూరేళ్లూ నిండకుండానే పాడు నుయ్యి బలిగొంది"

శవం ప్రక్కన మా అన్నయ్య రోదన కర్ణకఠోరంగా.... అక్కడి వాళ్లందరి గుండెల్ని కకావికలం చేస్తోంది.

"విజయా! ఎంత పన్జేశావ్! ఎంత ఘోరంగా నన్నొంటరిని చేశావ్ విజయా." మా అన్నయ్య గొంతులోనే గొణుక్కుంటున్నాడు.

శవాన్ని దహనం చేసేశారు.

ఆ రోజు రాత్రి నా గదిలో- ఒంటరిగా వదినని తలచుకొని బాధపడుతూ.... ఆమె జ్ఞాపకాలను త్రవ్వకొంటూ కూర్చున్నాను.

డైరీ తీశాను అన్యమనస్కంగా. చిన్నగా మడతపెట్టిన ఉత్తరం క్రింద పడింది. అప్రయత్నంగా అందుకుని విప్పాను.

చిరంజీవికి ఆశీస్సులతో....!

చాన్నాళ్ళుగా.... అంటే రెండేళ్లుగా నీకు చెప్పాలనుకుంటూ చెప్పలేకపోతున్న విషయం ఒకటుంది. మీ అన్నయ్య నీకూ-నాకూ అక్రమ సంబంధం అంటగట్టారు. నేను నీతో చనువుగా ప్రవర్తిస్తున్నందుకు ఆయన చెప్పిన భాష్యం అది.

నా మీద ఆయనకు మోజు తీరిపోయింది. నన్ను వదిలించుకో చూస్తున్నారు.

ఇవాళ.... ఇప్పుడే తలనొప్పిగా ఉందంటే బలవంతంగా ఏదో తెచ్చి మింగించారు. అప్పటినుంచి నా ఒళ్ళు... కాళ్ళు.... కళ్లూ తేలిపోతున్నాయి. నా అవయవాలు నా స్వాధీనం తప్పుతున్నాయి.

బహుశా ఇవే నా ఆఖరి ఘడియలేమో!

అందుకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఈ వదనకి నీ గుండెలోనన్నా ఇంత చోటిస్తావన్న ఆశతో— నీ వదిన

—విజయలక్ష్మి

